# పాపమూ

మెట్లపల్లి కామేశ్వర శర్మ

కాఫీకి ఆర్డరిచ్చి, హోటల్ బల్లమీద పెట్టిన మోచేతికి తల ఆనించి కళ్లు మూసుకున్నాడు మూర్తి. శూన్యంగా ఉన్న మనసులో తిరుపతి ప్రశాంతంగా పరిభ్రమిస్తూంది.

తను తిరుపతి వెళ్లింది వేంకటేశ్వరుడి దర్శనంకోసం కాదు. యూనివర్సిటీ పని మీద. తను గడిపిన మూడున్నర రోజుల్లోనూ [illegible] మీదకు వెళ్లే అవకాశం [illegible] తను వెళ్లాలన్న కోరికా లేదు. పగలు యూనివర్సిటీలో గడిపాడు. సాయంత్రం స్నేహితులతో గడిపాడు.

కానీ, కళ్లు మూసినా, తెరిచినా — తిరుపతి కొండలు, దేవాలయాలు, గోపురాలు, వేంకటేశ్వరుడి పటాలు, బల్బులు, అగరు పుల్లలు, పూజలు, నైవేద్యాలు, గోవిందలు, పసుపు బట్టలు, బోడిగుళ్లు! తిరుపతిలో గడిచిన ఒక్క రోజు మనసు మీద వేంకటేశ్వరుణ్ణే అదిమేస్తూంది.

అమాయకంగా, ఆశ్చర్యంగా దిక్కులు చూస్తూ, చూడలేకపోతూ పెద్దవాళ్లవి పట్టుకుని అడుగులు వేస్తున్న పసివాళ్లకీ— చంకల్లోనూ, భుజాలమీదా పిన్నవాళ్లనీ, సంచుల్నీ సరిచేసుకుంటూ పరుగులు పెడుతున్న పెద్దవాళ్లకీ—తెచ్చుకున్న డబ్బు ఆవిరి అయిపోతుంటే హోటళ్లలో ఆకలి తీర్చుకుంటూ బిక్కు బిక్కుమంటున్న మధ్య తరగతి వాళ్లకూ— మాడిపోతున్న కడుపులు ఖాతరు చెయ్యకుండా కాలి నడకన కొండ ఎక్కి దిగుతున్న పేదవాళ్లకూ — ఎదురౌతున్న మోసాలనూ, మనుష్యుల్నీ విలబడి నోరు తెరుచుకు చూస్తున్న పల్లెటూరి రైతులకూ — తిరుపతి రోడ్లలో తారసిల్లే నూరు మందిలో కనీసం తొంభై మందికి— తిరుపతి అంటే ఒకటే అర్థం — వేంకటేశ్వరుడు!

కానీ, వీళ్లందరికీ వేంకటేశ్వరుడు— జీవితానికి పరమావధి అయిన పరమాత్మ కాదు. ఈ జీవితాన్ని తన ఇష్టానుసారం మలిచే మహిమ ఉన్న ఒక శ్రేష్ఠమైన దేవుడు. వీళ్ల లక్ష్యం వేంకటేశ్వర సందర్శనం కాదు. కష్టాన్ని వదిలించుకుని జీవితాన్ని అనుకూలంగా మలుచుకోవటం. గర్భగుళ్లలో హారతు లిస్తున్న పూజార్ల ముఖంలో కనుపించే వెలుగు బ్రహ్మ వర్చస్సు కాదు. నైవేద్యాలు సకాలంగా సేవించటం వల్ల ఏర్పడ్డ ఆరోగ్యం. కిటకిటలాడుతున్న దేవస్థానపు సత్రాలు భక్తులకు మాత్రమే ఆశ్రయాలు కావు. హోటళ్లు సైతం ఎదుగుతున్న తావులు.

అయినా నాటికీ — [illegible] మొక్కుల వాడి హుండీ కానుకలతో నిండి పొంగి పోతూంది. వాడి చుట్టూ ఉన్న పరివారంలో సిరి [illegible]. వేంకటేశ్వరుడి విగ్రహం మాత్రం — ఎప్పటిలాగానే — తనని ఆశ్రయించమని పాదాలు చూపుతూంది. ఆశ్రయిస్తే, ఈ భవ సాగరం నడుము లోతు రాదని హామీ ఇస్తూంది.

కాఫీ వచ్చింది.

మూర్తి కళ్లు తెరిచి, కాఫీ గుటక వేసి టైమ్ చూసుకున్నాడు. ఇంకా రెండు గంటలు పైగా గడవాలి. హోటల్లో మనుషులూ లేరు. తినదగ్గ పదార్థాలూ లేవు. తనకి తినాలనిపించే ఆకలి కూడా లేదు. బోరుగా ఉంది. తాగుతున్న కాఫీ వెగటుగా ఉంది.

తను సాయంత్రం అయిదున్నరకి రేణిగుంటలో దిగాడు. అప్పటికి కొద్ది నిమిషాల ముందే — మెయిల్‌కోసం రాత్రి ఒంటిగంట దాకా గడపవలసిన బరువు తన మీద పడిరి — ఐవతా వెళ్లిపోయింది. తీరికగా హోటల్లో స్నానం చేసి ధ్యానం చేసుకున్నాడు. టిఫిన్ చేసి రేణిగుంట వీథుల్లో పడ్డాడు. జూనియర్‌కి చాకొలెట్లు కొన్నాడు. శ్రీమతికి కావదగ్గ వస్తువులకోసం షాపులన్నీ పరిశీలనగా చూశాడు. ఆ తరవాత తెలుగు సినిమా ఆడుతున్న టూరింగ్ టాకీసులో మూడున్నర గంటలు గడిచింది. ఇప్పుడు కాఫీ పూర్తి అయ్యేసరికి రాత్రి పదకొండు అయింది.

మెయిల్‌కి టిక్కెట్లు ఇవ్వటం మరొక గంటకు కాని ఆరంభం కాదు. కానీ, నిర్మానుష్యంగా ఉన్న ఈ హోటల్‌లో కన్న అనేక ముఖాలు కనుపించే చోట, ఆసక్తి కలిగించే ముఖాలను వెతుక్కుంటూ గడపటం సునాయాసంగా ఉంటుంది. సిగరెట్ ముట్టించి స్టేషన్ బయట బడ్డీ కొట్ల వైపు కదిలాడు మూర్తి.

రేణిగుంట ప్రాణాలకు రాత్రిపూట ఆశ్రయం ఇస్తున్న తావుల్లాగా బడ్డీ కొట్లు ట్యూబ్ లైట్ల వెలుగుతో ధగధగ లాడుతున్నాయి. స్టేషన్ ఆవరణ దాటి పొర్లిపోయిన ప్రయాణీకులు ఈ కొట్ల ముందు బట్టలు పరుచుకుని గుంపులు గుంపులుగా కునికిపాట్లు పడుతున్నారు. ఈ గుంపుల్లో తారసిల్లుతున్న పసుపు బట్టలూ, బోడిగుళ్లూ — రేణిగుంట తిరుపతికి తోబుట్టువే అనిపించేటట్లు చేస్తున్నాయి.

కిళ్లీ కట్టించుకునేటందుకు ఒక బడ్డీ దగ్గర ఆగాడు మూర్తి.

తయారవుతున్న కిళ్లీని చూస్తున్న మూర్తి — "గోవిందా! గోవిందా!" అన్న మాటలు చెవిని పడి పక్కకి తిరిగాడు. అక్కడక్కడ జుట్టు నెరిసిన, సుమారు ముప్పై అయిదేళ్ల పెద్ద మనిషి — బడ్డీ కొట్టు ముందున్న బెంచీ మీద వీరాసనం వేసుకుని దూరంగా ఉన్న గుంపులోకి తదేకంగా చూస్తూ, తిరుపతి యాత్రికులు గోవింద కొట్టటాన్ని అనుకరిస్తున్నాడు. ఆ గుంపు మధ్యలో బోడి గుండుకి గంధం పూసుకున్న ఒక పల్లెటూరి మనిషి — చొంగ కారేటంత గాఢంగా — కూర్చుని నిద్ర పోతున్నాడు. వీరాసనపు పెద్ద మనిషి— "గోవిందా! గోవిందా!" అంటూ పక్క బెంచీ వైపు చూశాడు.

ఆ గుంపునే ఆసక్తిగా చూస్తున్న పక్క బెంచీ మీద యువకుడు, ఆ మాటలతో ఈ లోకంలోకి వచ్చి, పెద్ద మనిషి జోక్ వేశాడని గ్రహించినట్లు ఒక నవ్వు విసిరాడు. ఆ యువకుడి వయసు సుమారు పాతికేళ్లు ఉంటుంది.

ఆ ఇద్దరూ తెల్లటి ఛాయతో, నున్నటి శరీరాలతో ఉత్తర హిందూస్థానపు బస్తీ మనుష్యుల్లా ఉన్నారు. జుట్టు నెరిసిన పెద్దమనిషికి — ఫాషన్ అంటే వ్యామోహం చచ్చింది కాబోలు— చాలా సాదాగా ఉన్నాడు. ఆ యువకుడు మాత్రం టైట్ పాంట్ మీద నీలి రంగు టెరిసిల్క్ టీ—షర్టు వేసుకుని షోగ్గా ఉన్నాడు. అతని మెడలో సన్నని బంగారు గొలుసు, పై గుండీ వదిలేసిన టీ—షర్ట్‌లో మంచి మెరుస్తూంది. ఆ పెద్దమనిషిని — వేళాకోళానికి అనువైన వెకిలితనం బలంగా ఆకట్టుకుందో, లేక తనే కావాలని దానికోసం పరిసరాల్లో వెతుక్కుంటున్నాడో గాని — అతను మూర్తిని గుర్తించలేదు. యువకుడు మాత్రం మూర్తి వైపు క్లుప్తంగా కుతూహలంగా చూశాడు.

కిళ్లీ తయారయింది. దాన్ని అందుకుని, డబ్బు లిచ్చి, ఆ యువకుడి పక్కన కూర్చుంటూ, "ఎక్కడి నుంచి వస్తున్నారు?" అని అడిగాడు మూర్తి హిందీలో. యువకుడు కూడా సంభాషణలో ఉత్సాహంగా పాల్గొన్నాడు.

వాళ్లు గుజరాతీలు. ఆ యువకుడి పేరు దినేష్. సికిందరాబాద్‌లో వాళ్ల అన్నయ్య దగ్గర ఉండి బి. ఎస్‌సి. వరకు చదివాడు. కొద్ది రోజులు బాంక్‌లో ఉద్యోగం చేసి, ఆ తరవాత వాళ్ల అన్నయ్య తాలూకు ఆటోమొబైల్ షాప్‌లో చేరాడు. ప్రస్తుతం బొంబాయిలో వాళ్ల పినతండ్రి పెద్దవాడు అవటం వల్ల ఆయనకి హోల్‌సేల్ బట్టల వ్యాపారంలో సాయంగా ఉంటున్నాడు. బొంబాయిలో తయారయ్యే బట్టలకు దక్షిణాదిలోనూ, దక్షిణాదిలో తయారయ్యే బట్టలకు బొంబాయిలోనూ మార్కెట్ చూడటం వాళ్ల పని. దినేష్ ఇప్పుడిప్పుడే జీవితంలో స్థిరపడుతున్నాడు. బాధ్యత అంటే తెలుసుకుంటున్నాడు. ఈ మధ్యే అతని పెళ్లి అయింది.

చమన్ అనే ఆ వీరాసనపు పెద్ద మనిషి దినేష్‌కి వరసకు అన్న అవుతాడు. ఇతను కూడా వాళ్ల వ్యాపారంలోనే పని చేస్తున్నాడు. ప్రస్తుతం వాళ్లిద్దరూ కోయంబత్తూరులో వ్యాపారపు వ్యవహారాలు సరిదిద్దుకుని బొంబాయి వెడుతున్నారు. వెడుతూ, వాళ్ల పినతండ్రి అనుమతితో రేణిగుంటలో ప్రయాణం ఆపి, బాలాజీ దర్శనం చేసుకోవాలన్న చిరకాల వాంఛని తీర్చుకున్నారు.

భారతదేశం నలు మూలల నుంచీ మాట అటుంచి విదేశీయులు కూడా బాలాజీ దర్శనంకోసం తిరుపతి వస్తారని మూర్తికి తెలుసు. కానీ, ఈ రావటం ఒక రకమైన సరదా మాత్రమే కాక పోవచ్చు నన్న అనుమానం అతనికి ఇప్పుడే కలుగుతూంది. వ్యాపార సంప్రదాయంలో

> సౌష్ఠవంగల స్త్రీ రత్నం వంటిది. సుగుణాలుగల స్త్రీ సంపద వంటిది.
>
> — [illegible]



పుట్టి, మహా నగరాల నాగరికత తప్పించి ఎరగని ఈ యువకుడూ, స్టేషన్‌లో కనిపిస్తున్న బోడిగుళ్లని అపహాస్యం చేస్తున్న ఈ పెద్దమనిషి — రేణిగుంట లాంటి ఊళ్లో మెయిల్ కోసం పడిగాపులు పడటానికి కారణం — మారుమూల తిరుపతిలోని బాలాజీ దర్శనం చేసుకోవాలన్న చిరకాల వాంఛ.

"మీకు కూడా బాలాజీకి మొక్కే ఆచారం ఉందా?" అనుమానంగా అడిగాడు మూర్తి.

"లేకేం?" అంటూ దినేష్ చదివిన ఉదాహరణలిస్తున్న తాను తెల్లబోతున్నాడేమో అనిపించింది మూర్తికి.

"ఇంత మారుమూల తిరుపతిలోని దేవుడికే మొక్కటానికి కారణం?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నమ్మకం!" అన్నాడు దినేష్.

మూర్తి ఖాయంగా తెల్లబోయాడు. మానవుడు ఆచరించిన ప్రతి కర్మకీ సమానమైన అనుబంధం ఉండి తీరుతుందన్న కర్మ సిద్ధాంతాన్ని నరనరాల్లోనూ జీర్ణించుకున్న భారత దేశంలో — వేంకటేశ్వరుడికి మొక్కటంలోని నమ్మకం — ఆంధ్ర ప్రాంతపు హద్దులు దాటి ఎల్లా విస్తరించిందో అతనికి అంతుపట్టటం లేదు. ఈ వేంకటేశ్వరుడికి మొక్కినంత మాత్రాన మనిషి చేసిన పాప కర్మ నశిస్తుందా? జీవితంలో అనుభవించవలసిన దుష్ఫలితాలు పోయి, సత్ఫలితాలు కలుగుతాయా?

"మీకు దేవుడంటే నమ్మకం ఉందా?" హఠాత్తుగా అడిగాడు దినేష్.

మూర్తి క్షణంసేపు ఇబ్బంది పడ్డాడు.

"లాటరీలో నాకు ఎంత వచ్చినా ఫిఫ్టీ, ఫిఫ్టీ చేసుకుందామని చాలాసార్లు మొక్కాను. నప్పులు ఉడకలేదు" అన్నాడు దిగులుగా మొహం పెడుతూ.

దినేష్ బిగ్గరగా నవ్వాడు. మూర్తి నవ్వుతూ టైమ్ చూసుకున్నాడు. మెయిల్‌కి టిక్కెట్లు ఇచ్చే టైమ్ అయింది. తనొక్కడే టికెట్ తీసుకోవాలి. వాళ్లిద్దరికీ ఉన్నాయి.

"టికెట్ తీసుకుని ప్లాట్‌ఫారమ్ మీదకు వెళదామా?" అన్నాడు మూర్తి.

అంతా లేచారు.

బొంబాయి మెయిల్‌కి టిక్కెట్లు తీసుకుంటున్న క్యూ ఏమంత రద్దీగా లేదు. కాఫీ, వెయిటింగ్ హాల్ నేలమీద కాలు మోపే జాగా లేకుండా — కాలినడకను కొండ ఎక్కి దిగిన మనుషులు కాబోలు — ఒళ్లు తెలియకుండా పడి నిద్రపోతున్నారు. మూర్తి వీళ్లందరినీ దాటి టికెట్ తీసుకుని బయట పడేటందుకు చెప్పుకోదగ్గ ప్రయాసే పడ్డాడు. అప్పటికే చమన్‌కీ, ఎవరో బోడిగుండు ప్రయాణికుడికీ మధ్య ఏదో వ్యవహారం నడుస్తోంది. జనం ఇద్దర్నీ వింతగా చూస్తున్నారు.

నడుంమీద చేతులు మోపి, మెడ పక్కకి వంచి వింత జంతువుని పరికిస్తున్నట్లు ఆ బోడి గుండు యువకుడి వంక తదేకంగా చూస్తున్నాడు చమన్.

పొట్టిగా, సన్నగా, పాంట్ వేసుకున్న మనుషుల ముఖాలు ఎరుగ నట్లున్న, ఆ పల్లెటూరి యువకుడు బెంబేలు ఎత్తినట్లు చమన్ వైపు చూస్తున్నాడు. అతను బెదురుతున్న కొద్దీ చమన్ తీక్ష్ణంగా చూస్తున్నాడు. చమన్ చూస్తున్న కొద్దీ ఆ మనిషి తాను ఆనుకు కూర్చున్న వెయిటింగ్ హాల్ స్తంభపు మొదట్లోకి కూరుకుపోతున్నాడు.

ఉన్నట్లుండి కుడిచేయి చూపుడు వేలు పైకి లేపి "ఉర్!" అన్నాడు చమన్. తాడుపెట్టి పైకి లాగినట్లు వేలాడిపోతూ లేచాడు ఆ యువకుడు. చమన్ వేలు కిందికి దింపాడు. ఆ యువకుడు కూలబడిపోయాడు.

అది చూసిన మూర్తికి చమన్‌ని ఊచిపెట్టి ఒకటి ఇద్దామన్నంత చిరాకు వచ్చింది. తమాయించుకుని, "ఏమిటిది?" అంటూ ముందుకు కదిలాడు. దినేష్ అనుసరించాడు.

అంతటి ఆసక్తికరమైన జంతువుని విడవలేక విడుస్తున్నట్లు ఆ వైపు తిరిగి తిరిగి చూస్తూ ముందుకు కదిలి, "ఎవడో? సగం పిచ్చిలా ఉంది!" అన్నాడు చమన్.

"పూర్తిగా మంచివాడైనా, పూర్తిగా పిచ్చివాడైనా ఈ పాటికి కరిచి ఉండేవాడు" అన్నాడు మూర్తి.

* * *

అరగంట లేటుగా మెయిల్ వస్తూంది.

వచ్చి ఆగితే చాలు, మరు క్షణంలో దానిలో దూసుకుపడేటట్లు శరీరాలన్నీ లేచి ఎక్కుపెట్టుకుని ఎదురు చూస్తున్నాయి. ఆఖరుకు చమన్ కూడా తన దృష్టిని ప్లాట్‌ఫారమ్ మీద బోడిగుళ్ల మీద నుంచి మళ్లించి, వస్తున్న మెయిల్ మీద బిగించాడు. భుజానికి తగిలించిన బాగ్‌ని సరిచేసుకుంటూ, ముందుకు దూకటానికి సిద్ధంగా ఉన్నాడు. బాస్‌కు చూపించేటందుకు తీసుకు వెడుతున్న శాంపుల్ చీరలు కాబోలు —భోషాణం లాంటి ఒక ట్రంక్ పెట్టెని కూలీ తలకు ఎత్తించాడు. దానిమీద సూట్‌కేసులు సర్దించి, "సీటు చూపించకపోతే డబ్బులు ఇవ్వను సుమా!" అని కళ్లు పెద్దవిచేసి హెచ్చరించాడు. మూర్తి, దినేష్—ఇద్దరూ ట్రెయిన్ వైపు చూస్తూ వీడ్కోలు చెప్పుకున్నారు.

జనంతో కిటకిటలాడిపోతూ, ప్లాట్‌ఫారమ్ మీద జనాన్ని చూసి ముఖం మాడ్చుకుంటున్నట్లు మెయిల్ ఆగింది. దాని మహత్త్వంతో ప్రమేయంలేకుండా — జాగాల్లాగా కనుపిస్తున్న దిశల్లో శరీరాలు శరవేగంతో దూసుకుపోతున్నాయి. దూరే సందు లేనప్పుడు అంతే వేగంతో పక్క పెట్టెల వైపు మళ్లుతున్నాయి. దిగటానికి విశ్వప్రయత్నం చేస్తున్న లోపలి మనుషులతోనూ, ఎక్కటానికి పూనుకున్న బయటి మనుషులతోనూ, పొలికేకలతోనూ రైలు పెట్టెల ద్వారాలు కల్లోలానికి ప్రతిరూపాల్లాగా ఉన్నాయి.

పరుగు పెడుతున్న కూలివాణ్ణి — "సీటు లేకపోతే డబ్బుల్లేవు!" అని మరోసారి హెచ్చరిస్తూ అనుసరించాడు చమన్. ఆ ఇద్దరికీ ముందుగా పై కంపార్ట్‌మెంట్ల వైపు జాగాలను అన్వేషిస్తూ హడావిడిగా కదిలాడు దినేష్. సూట్‌కేసుతో అందుబాటులో ఉన్న పెట్టెలోకి దూరాడు మూర్తి.

మూర్తి లోపలి జనాలను లాఘవంగా తప్పుకుంటూ ఊపిరి ఆడటానికి అవకాశం ఉన్నచోట నిలబడేచోటు సంపాదించేసరికి, రైలు పెట్టెల ద్వారాల దగ్గర ముసురుకుంటున్న జనాలు సర్దుమణిగారు. దినేష్, కూలీవాడు, చమన్—మూర్తి ఎక్కిన కంపార్ట్‌మెంట్ దగ్గర మళ్ళీ తేలారు. దినేష్ ఆ పెట్టెలో ఎక్కేటందుకు సిద్ధపడుతున్నాడు. చిరాకు పడుతున్న చమన్ పై పెట్టె ఏదో ట్రై చేద్దామంటున్నాడు. కూలీవాడు కసురుకుంటూ తలమీద సామానుని కంపార్ట్‌మెంట్ ద్వారంలోకి తోశాడు.

దినేష్ లోపలికి ఎక్కేశాడు. చంకలో వేలాడుతున్న సంచిలో సహా గస్సాలు పెడుతున్న జనాన్ని దూసుకుంటూ— ట్రంక్ పెట్టెని లోపలికి ఈడ్చి, దాన్నీ సూట్‌కేసుల్నీ అనువైన చోట సర్దాడు. జనాల మధ్య గాలి అందేటట్లు ముక్కుని పైకి లేపుతూ కూరుకుపోయాడు.

అప్పటికి చమన్‌కీ, కూలివాడికీ మధ్య నడిచిన రభస సర్దుకుంది. డబ్బు లిచ్చి వాడిని వదిలించుకుని పెట్టెలోకి ఎక్కి బయటికి చూస్తూ ద్వారం దగ్గర నిలబడ్డాడు చమన్. కంపార్ట్‌మెంట్‌లో కొంపలు అంటుకున్నంత సంక్షోభం సర్దుమణిగింది.

పై పెట్టెని ట్రై చెయ్యలేదన్న అసంతృప్తి, దినేష్ తన మాటను తోసిపుచ్చటం వల్ల అహం దెబ్బతిందో, కూలివాడికి ఓడిపోయానన్న బాధో కాని — చిరాకుతో తీక్షణంగా బయటికి చూస్తూ పరధ్యానంగా ఉన్నాడు చమన్. కొద్దిసేపు మౌనంగా ఊరుకుని, చమన్‌ని హుషార్ చేస్తున్నట్లు — "గోవిందా! గోవిందా!" అన్నాడు దినేష్.

వెంటనే గార్డు గట్టిగా ఈల వేశాడు.

దినేష్ మాటలకు చమన్ బలవంతంగా వెనక్కి తిరిగి వెంటనే ముఖం తిప్పుకున్నాడు. అదే క్షణంలో గుండెలు అవిసిపోయేటట్లు కూతపెడుతూ రైలు కదిలింది. అదే క్షణంలో రైలు పెట్టె అవతలి ద్వారంలోనుంచి నల్లటి ఎయిర్ బాగ్ భుజానికి తగిలించుకుని ఎవరో మనిషి బయటికి దూకేస్తున్నాడు.

చమన్ ఖంగారుగా వెనక్కి తిరిగి, "నల్లబాగ్ ఉందా." అని అడిగాడు. సామాన్లని సర్దేసిన సంతృప్తిలో వాటి ధ్యాసని తాత్కాలికంగా వదిలేసిన దినేష్ మరింత ఖంగారుగా చూస్తూ — "నీ దగ్గర లేదా?" అనేశాడు.

మరుక్షణంలో చెలరేగిన కల్లోలం రేణిగుంట స్టేషన్‌ని ఒక ఊపు ఊపింది.

కదులుతున్న రైలులోనుంచి "దొంగ! దొంగ!" అని కేకలు పెడుతూ చమన్ బయటికి దూకేశాడు. ఆ ఖంగారులో ముందుకు పడి రెండు మూడు దొర్లింతలు పెట్టాడు. ఎవరో చెయిన్ లాగి రైలుని నిలబెట్టారు. రైలులోనుంచి జనాలు బయటికి దూకేశారు. మరి కొందరు నల్లబాగ్‌తో బయటికి దూకిన మనిషిని చుట్టు ముట్టారు. బూట్లు టకటకలాడిస్తూ, బూరలు ఊదుతూ పోలీసులూ, రైల్వే అధికారులూ హడావిడిగా ఆ ప్రదేశంలో గుమికూడారు.

దినేష్ ఖంగారుగా చిందులు తొక్కి, సామాను మూర్తికి అప్పగించి, జనాన్ని తోసుకుంటూ చమన్ దగ్గరకు వెళ్లాడు. కాళ్లూ, చేతులూ డోక్కుపోయి, పాంట్ మీదా, చేతుల మీదా రక్తపు మరకలతో, రేగిపోయిన జుట్టుతో నల్లబాగ్ మనిషి మీద బుసలు కొడుతూ లేచాడు చమన్.

దినేష్ చమన్‌ని పట్టుకుని, "ఆగాగు!" అంటూ చల్లబరిచి, "నల్లబాగ్ మన దగ్గరే ఉంది" అని చల్లగా చెప్పాడు.


* * *

రైలు వేగంగా పోతూంది.

ప్రతి పెట్టెలో లాగే ఈ పెట్టెలోనూ సంభాషణ చమన్ గురించే నడుస్తూంది. అయితే ప్రత్యేకంగా ఈ పెట్టెలోని జనాలు మధ్యమధ్యలో చమన్‌ని చూస్తూ సంభాషణని మరింత రసవత్తరంగా నడుపుకో గలుగుతున్నారు.

జరిగిన సంఘటనతో మనసూ, ఒళ్లూ మొద్దుబారిపోయినట్లు స్థాణువులా నిలబడ్డాడు చమన్.

మూర్తి సాలోచనగా చమన్ చూస్తున్నాడు. పాపం కానీ, పుణ్యం కానీ—మనుషులు ఆచరిస్తున్న కర్మకి ఫలితం వెంటనే దక్కటం లేదు. కానీ, ఒక పల్లెటూరి అమాయకుణ్ణి వింత జంతువులా చూసిన ఈ మనిషికి — తానే వింత జంతువుగా మారిన అనుభవం ఇంత వెంటనే కలగటానికి కారణం? ఇతని భక్తికి ప్రతిఫలంగా — ఇతని పాపాన్ని వెంటనే పరిహరించి, భవసాగరాన్ని నడుము లోతుకు అణచదలచిన బాలాజీ కరుణ కాదూ? ✱



వెండి మబ్బులు — ఫోటో—ఎస్. అన్వర్‌భాషా (మండ్య)